తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
21-05-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 272 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

# రేవ్ పార్టీ కలకలం



2 లో

బెంగళూరులో ఓ రేవ్ పార్టీని అక్కడి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) భగ్నం చేశారు. నగరంలోని ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో ఓ ఫాం హౌస్‌లో ఈ పార్టీ జరిగింది. స్థానిక జీఆర్ ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ పేరుతో పెద్ద ఎత్తున రేవ్ పార్టీని నిర్వహించినట్లుగా బెంగళూరు సీసీబీకి సమాచారం అందడంతో వారు ఆకస్మిక దాడులు చేశారు. ఈ రేవ్ పార్టీలో భారీగా లిక్కర్ తో పాటుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ కూడా యువతీయువకులు తీసుకున్నట్లు తెలుస్తోంది. జీఆర్ ఫామ్‌హౌస్ అనేది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యక్తికి చెందినది పోలీసులు గుర్తించారు.



## సుశీల్ మోడీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని

జయభేరి, బీహార్ :

బీహార్‌లోని పాట్నాలో ప్రధాని మోడీ పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఇటీవల మృతిచెందిన మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ మోడీ నివాసానికి ప్రధాని వచ్చారు. ముందుగా సుశీల్ మోడీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఇటీవలే దివంగత బీజేపీ నేత సుశీల్ కుమార్ మోడీ కన్నుమూశారు. కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ ప్రాణాలు విడిచారు. పలుమార్లు ఆర్థిక మంత్రిగా సేవలందించారు. నితీష్‌కుమార్ కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా పని చేశారు. రాజకీయాల్లో బహు అనుభవం కలిగిన నేతగా ఉన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గా సుశీల్ మోడీని నియమించారు. కానీ ఆయన అకాల మరణం పొందారు. ఇదిలా ఉంటే ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ బీహార్‌లో రోడ్ షో నిర్వహించారు. వాహనంలో నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చరు. ప్రధాని మోడీ వెంట రాష్ట్ర బీజేపీ నేతలు, జేడీయూ నేతలు ఉన్నారు. ఇక్కడ జేడీయూ, బీజేపీ ఉమ్మడిగా బరిలోకి దిగింది. 1973లో విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సుశీల్ మోదీ.. 1990లో పట్నా సెంట్రల్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా, ఎంపీగా సేవలందించారు. 2005 నుంచి 2020 మధ్య రెండు దఫాలుగా 11 ఏళ్ల పాటు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.



## ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి మృతి

జయభేరి, న్యూఢిల్లీ, మే 20:

ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందినట్టు ఇరాన్ మీడియా ప్రకటించింది. రైసీతో పాటు విదేశాంగ మంత్రి కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్టు వెల్లడించింది. క్రాష్ అయిన హెలికాప్టర్‌ని గుర్తించిన అధికారులు...అధ్యక్షుడు బతికే ఉన్నారన్న నమ్మకం తమకు ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌ని కలిసి ఇరాన్‌లోని తబ్రీజ్ సిటీకి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రాష్‌కి సంబంధించిన

...మిగతాది 2 లో




## కవితకు బిగ్ షాక్

జయభేరి, హైదరాబాద్, మే 20:

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జుడీషియల్ రిమాండ్‌ను కోర్టు మరింత పొడిగించారు. జూన్ 3 వరకూ కవిత రిమాండ్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు అయి తీహార్ జైలులో కవిత రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ రిమాండ్ గడువు నేటితో ముగియడంతో తీహార్ జైలు అధికారులు కవితను వర్చువల్ గా రౌస్

...మిగతాది 3 లో



## 80 కోట్ల స్థలం కబ్జాకు యత్నం

- బోరబండ పీఎస్లో కేసు నమోదు..

జయభేరి, హైదరాబాద్:

ఎర్రగడ్డ డివిజన్లోని బోరబండ ప్రాంతంలో ఉండే సారథి నగర్ లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదివారం కె. కుషాల్ రాజ్ అనే వ్యక్తి ప్రయత్నించాడు. స్థానిక ప్రజలు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు కుశాల్ రాజ్ మియాపూర్ నివాసి ఆయన త్రిలింగ బయో క్యూర్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తున్నాడు. బోరబండ లోని విజేత థియేటర్ ఎదురుగా

...మిగతాది 2 లో

## పాడైన ఆహారపదార్థాలు

- హోటల్లలో షాకింగ్ సీన్స్

జయభేరి, హైదరాబాద్, మే 20:

హైదరాబాద్ లో ఎక్కడ చూసిన హోటళ్లు, రెస్టారెంట్లు భారీగా కనిపిస్తుంటాయి. ఆహార ప్రియులు కూడా అంతే స్థాయిలో అక్కడికి వెళ్తుంటారు. ఇష్టమైన ఆహారాలను తినేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఇక వీకెండ్స్ వస్తే.... చాలా కుటుంబాలు రెస్టారెంట్లకు వెళ్లాల్సిందే అన్నట్లు ఉంటుందపెద్ద పెద్ద హోటల్స్, రెస్టారెంట్లకు వెళ్తే ఆహార ప్రమాణాలను పాటిస్తారనే భావన అందరిలోనూ ఉంటుంది. అయితే చాలాచోట్ల అలాంటి పరిస్థితులు కనిపించటం లేదు. ఆకస్మికంగా చేస్తున్న తనిఖీల్లో వారి డొల్లతనం బయటపడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్ లోని లక్డీకాపుల్ పరిధిలోని పలు హోటళ్లలో ఫుడ్ సెఫ్టీ కమిషనర్ టాస్క్ ఫోర్స్(తెలంగాణ) బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఇందులో షాకింగ్ నిజాలు బయటికి వచ్చాయి. లక్డీకాపుల్ లో

...మిగతాది 2 లో





## మీ ఓటు తో గుణపాఠం చెప్పండి

జయభేరి, నల్లగొండ :

నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తండ్రి కనిలాల్ నాయక్ మృతి బాధాకరం అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో కనిలాల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మీడియా తో మాట్లాడుతూ.. బడిపంతుళ్ళపై లాఠీలు, బడుగు జీవులకు జూటా హామీలు, ఇదీ రేవంత్ పాలన. కాంగ్రెస్ వంద రోజులు హామీ అమలు కాలేదు, విద్యార్థి భరోసా కార్డు రాలేదు, స్కూటీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి అమలుపట్ల భట్టి చేతులెత్తేశారు. ఎన్నికల ముందు ప్రియాంక, రాహుల్, రేవంత్ ఇచ్చిన ఏ హామీ కూడా అమలు కాలేదు. ఉద్యోగులకు మూడు డీఏలు అన్నారు. ఒక్క డీఏ కూడా రిలీజ్ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యోగులను మోసం చేసింది. రిటర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్ ఇవ్వలేదు. మెరుగైన పీఆర్ సీ నీ ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రేవ్ పార్టీ కలకలం

ఆయన గోపాల్ రెడ్డికి చెందినదని పోలీసుల విచారణలో తేలింది. రేవ్ పార్టీలో పోలీసులు మాదక ద్రవ్యాలను భారీగా గుర్తించారు. ఈ పార్టీలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నట్లు బెంగుళూరు పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీలో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నారని తెలిసింది. ఈ రేవ్ పార్టీలో వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ పేరుతో పాస్ ఉన్న కారు కూడా గుర్తించినట్లు తెలిసింది. సీసీబీ సోదాల్లో ఎండీఎంఏ సహా పలు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుగురిని సీసీబీ అదుపులోకి తీసుకుంది. అయితే, సినీ నటి హేమ కూడా ఈ పార్టీలో పాల్గొన్నట్లుగా వదంతులు వచ్చాయి. దీనిపై ఆమె స్పష్టత ఇచ్చారు.నేను హైదరాబాద్ లోనే ఉన్నాను. నాకు బెంగుళూరు రేవ్ పార్టీతో సంబంధం లేదు. అనవసరంగా నన్ను లాగుతున్నారు. కన్నడ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదు'' అని సినీ నటి హేమ తెలిపారు. బెంగళూరులో ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని ఫామ్‌హౌస్‌పై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దాడి చేసింది. G.R ఫామ్‌హౌస్‌లో తెల్లవారుజాము 3గంటల వరకు పార్టీ జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. తనిఖీల్లో డ్రగ్స్ కూడా పట్టుబడటం సంచలనంగా మారింది. 17 ఎండీఎంఏ ట్యాబ్లెట్లు, కొకైన్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. బెంగళూరు, ఏపీ, తెలంగాణ నుంచి 100 మందికి పైగా హాజరయినట్లు తెలుస్తోంది. ఈ పార్టీలో 25 మందికి పైగా యువతులు ఉన్నట్లు చెబుతున్నారు.GR ఫామ్‌హౌస్.. అంటే గోపాల్‌రెడ్డి ఫామ్‌హౌస్..? కాన్ కార్డ్ యజమాని గోపాల్‌రెడ్డి.. ఈయన ఫామ్‌హౌస్‌లో ఇంత పెద్ద పార్టీ ఎందుకు జరిగింది..? తెలంగాణకు చెందిన వాసు అనే వ్యక్తి ఈ పార్టీని హోస్ట్ చేసినట్లు చెబుతున్నారు. హైదరాబాద్‌కి చెందిన వాసు పూర్తి డీటెయిల్స్ ఏంటి..? పుట్టినరోజును ఇంత గ్రాండ్‌గా ఎందుకు ప్లాన్ చేశారు..? 100 మందిని పిలిచారు.. ఇందులో VVIPలు, సెలబ్రిటీలు ఉన్నట్టుగా చెప్తున్నారు. దీనిపైనే ఇప్పుడు పూర్తి సమాచారం రాబట్టే పనిలో ఉన్నారు బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఇప్పటికే ఈ రేవ్ పార్టీపై కేసు నమోదు చేసింది.ఈ రేవ్ పార్టీకి హైఎండ్, పోష్ కార్లు చాలా వచ్చాయ్. వాటిల్లో ఓ బెంజ్ కార్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. దానికి కారణం.. ఆ కార్‌పై ఏపీ MLA కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్టిక్కర్ ఉంది. ఈ కారుతో తనకు ఎలంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ కారు తనది కాదని.. తన పేరును ఎవరో వాడుకుంటున్నారని చెప్పారు. రేవ్ పార్టీకి చాలా మంది సెలబ్రిటీలు కూడా హాజరైనట్టు చెప్తున్నారు. టాలీవుడ్‌కి చెందిన కొందరిని పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. కన్నడ మీడియాలో నటి హేమ పేరు సర్కులేట్ అవుతోంది. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ స్పష్టం చేశారు. రేవ్ పార్టీలో తాను ఉన్నట్టు కన్నడ ఛానెల్స్‌లో, మీడియాలో వచ్చిన వార్తల్ని ఖండించారు.

## మీ ఓటు తో గుణపాఠం చెప్పండి

విద్యావంతులు, నిరుద్యోగుల్లారా.. ఆలోచన చేసి ఓటు వేయాలి.. మీ ఓటు తో గుణపాఠం చెప్పండి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డి నీ గెలించాలి. కాంగ్రెస్ కు ఓటేయడమంటేకాంగ్రెస్ మోసాన్ని బలపరిచినట్లవుతుంది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీ అంబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయి. యాజమాన్యాలు, విద్యావంతులు ఆలోచన చేసి ఓటు వేయాలని పిలుపు. జర్నలిస్టులకు వంద కోట్లు ఇస్తామని, వంద పైసలు ఇవ్వలేదు.. వంద పైసలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వ మాటలు కోటలు, చేతలు గడప దాటడం లేదు అన్నట్లుంది. వడ్లకు రైస్ మిల్లులో నాలుగు కేజీల తరుగు పెడుతున్నారు. ముప్పై రోజులైనా వడ్లు కొనలేదు. తడిసిన ధాన్యం పట్టించుకునే నాథుడు లేడు. బోనస్ విషయంలో చేతులెత్తేసిన సీఎం. మంత్రులు, ఉన్నతాదికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు లేవు. రైతుల ముఖాల్లో ఆనాడు చిరునవ్వు నేడు కన్నీరు.. బాండ్ పేపర్ బౌన్స్ అయ్యింది. బాండ్ పేపర్ బౌన్స్ కావడంతో ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ కు శిక్ష తప్పదు. అందరికీ మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి. గ్యారంటేలను అమలు చేయకుండా మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లేపాలంటే రాకేష్ రెడ్డి ని గెలిపించాలి. ఏటా రెండు కొట్లా ఉద్యోగాలిస్తామన్న బిజెపి ఎక్కడ ఇచ్చారో చెప్పాలి. రేవంత్ ముప్పై వేల ఉద్యోగాలు ఇచ్చింది అన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎలా ఇచ్చారు. వంట అంతా వండిపెట్టాక వద్దించినట్లుంది కాంగ్రెస్ వ్యవహారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటే రాకేష్ రెడ్డి నీ గెలిపించాలని హరీష్‌రావు విజ్ఞప్తి చేసినారు.

## 80 కోట్ల స్థలం కబ్జాకు యత్నం

ఉండే ప్రభుత్వ సీలింగ్ ల్యాండ్ ను కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలను సృష్టించాడు. సుమారు రూ.80 కోట్ల విలువచేసే స్థలాన్ని కబ్జా చేయాలని చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా స్థానికులు అడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు సారథి సొసైటీ లో ఉన్న ఆ స్థలానికి చేరుకుని కుశాల్ రాజ్ దగ్గర ఉన్న భూమి పత్రాలను పరిశీలించి నకిలీ పత్రాలుగా కనుగొన్నారు. అనంతరం రెవిన్యూ అధికారులు బోరబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కుషాల్ రాజ్ పై 447,427, ఐపీసీ, 156 (3) సి ఆర్ పి సి కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ స్థలాలను, ఆయా స్థలాలలో ఉండే ప్రభుత్వ సూచిక బోర్డులను ఎవరైనా తొలగించి కబ్జా చేయాలనే ప్రయత్నం చేస్తే తప్పని సరిగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

## పాడైన ఆహారపదార్థాలు

ఉన్న 'రాయలసీమ రుచులు' హోటల్ లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇక్కడ పాడైపోయిన పలు ఆహార పదార్థాలను గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులు పేర్కొన్నారు. పాడైపోయిన 20 కేజీల మైదా పిండిని గుర్తించారు. పురుగులు పట్టి పాడైపోయిన 2 కేజీల చింతపండును గుర్తించారు. ఉపయోగించే గడువు తేదీ ముగిసిన పాలను గుర్తించారు. 168 గోలిసోడా బాటిళ్లను సీజ్ చేశారు. వీటికి తయారీ లైసెన్స్ లేదు. వెజ్ నాన్ వెజ్ నిల్వ చేసే పద్ధతిలో ప్రమాణాలను పాటించటం లేదు. హోటల్ లో పరిశుభ్రత సమస్యలు ఉన్నాయి. ఇదే ప్రాంతంలో ఉన్న లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ కూడా లోపాలను గుర్తించారు. ఆహార పదార్థాల నిల్వ నిర్వహణ పద్ధతులు సరిగా లేవని తేలింది. పరిశుభ్రతతో పాటు నీటి సమస్యలను గుర్తించారు. కొన్ని ఆహారపదార్థాలను విశ్లేషించేందుకు ల్యాబ్ కు పంపినట్లు అధికారులు ప్రకటించారు. ఖైరతాబాద్ లోని కామత్ హోటల్ లో కూడా తనిఖీలు జరిగాయి. తయారీ వివరాలు లేనినూడిల్స్ తో పాటు టీ పొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువు రూ. 25వేలుగా ఉంది.హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లే ప్రజలు అక్కడ దొరికే ఆహారాల పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఆహర ప్రమాణాల విషయంలో అనుమానాలు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా... హోటళ్లు, రెస్టారెంట్లు పరిశుభ్రతతో పాటు నిర్ణయించిన ఆహార ప్రమాణాలను పాటించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి మృతి

వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఛాపర్‌లో రైసీతో పాటు విదేశాంగ మంత్రి హుసేన్ అమిర్ అబ్దుల్లాహియన్, మరికొందరు అధికారులు కూడా ఉన్నారు. వీళ్లలో ఎవరూ బతికి ఉండే అవకాశమే లేదని అధికారులు స్పష్టం చేశారు. హెలికాప్టర్ బయల్దేరిన తరవాత కాసేపటికి కాంటాక్ట్ తెగిపోయింది. దాదాపు అరగంట పాటు ఎలాంటి సమాచారం అందకపోవడం వల్ల అప్పటికే అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. క్రాష్ అయ్యుంటుందని భావించారు. వెంటనే పెద్ద ఎత్తున రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే..హెలికాప్టర్ క్రాష్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్న క్రమంలో అధికారులు ఇది ప్రమాదమేనని, వేరే ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన పని లేదని వెల్లడించారు. సిబ్బంది రంగంలోకి దిగి ఈ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ఇరాన్ అధ్యక్షుడి ఆచూకీ కనిపెట్టేందుకు అటు టర్కీ కూడా సాయం చేసింది. ఓ ఏరియల్ వెహికిల్‌ని పంపింది. దీని ద్వారానే క్రాష్ అయిన స్పాట్‌ని గుర్తించగలిగారు. అధ్యక్షుడి మృతిపై ఇరాన్ సుప్రీం అయతొల్లా అలి స్పందించారు. దేశంలో పరిపాలనా పరంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.ఇరాన్ అధ్యక్షుడి మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్, ఇరాన్ మధ్య మైత్రిని బలపర్చడంలో ఆయన ఎంతో చొరవ చూపించారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి, ఇరాన్ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో ఇరాన్‌కి భారత్ కచ్చితంగా అండగా ఉంటుందని X వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.

# ఎన్నికలను వదలని ఆ నలుగురు...

✍ జయభేరి, కరీంనగర్, నిజామాబాద్, మే 20:

**అధికారమనేది ఒక మత్తు లాంటిది. దానికి అలవాటు పడ్డవారు దూరంగా జరగలేరు. ఏదో ఒక రూపంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు.. పైగా మన సమాజం అధికారంలో ఉన్న నాయకులకే విలువ ఇస్తుంది. ఒకవేళ అధికారానికి దూరంగా ఉంటే ఆ నాయకులను సమాజం కూడా దూరం పెడుతుంది. ఇక కార్యకర్తల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బెల్లం ఉన్నప్పుడే ఈగలు వాలినట్టు.. అధికారం ఉన్నప్పుడే కార్యకర్తలు, నాయకులు, ఇతర అధికారులు చుట్టూ ఉంటారు. అదే కోల్పోతే దూరం జరుగుతారు. అధికారం పోతే దాని పర్యవసనాలు ఎలా ఉంటాయో నాయకులు తెలుసు కాబట్టి.. దాన్ని కాపాడుకునేందుకు రకరకాల జిమ్మిక్కులు చేస్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలో సరిగ్గా ఐదు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి.. అయితే ఈ రెండు ఎన్నికల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు పోటీ చేశారు. ఇంతకీ వారు ఎందుకు పోటీ చేశారు.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వారి పరిస్థితి ఏమిటి.. ఒకసారి పరిశీలిస్తే..**






**ఈటల రాజేందర్**

భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ భారతీయ జనతా పార్టీలో చేరారు. హుజురాబాద్ స్థానం నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ తో పాటు మాజీ సీఎం కేసీఆర్ పై గజ్వేల్ స్థానంలో పోటీ చేశారు. అటు గజ్వేల్ తో పాటు ఇటు హుజురాబాద్ లోనూ ఈటల రాజేందర్ ఓడిపోయారు. దీంతో తన రాజకీయ భవితవ్యాన్ని కాపాడుకునేందుకు దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్ గిరి నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థులుగా భారత రాష్ట్రసమితి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి సునీతా మహేందర్ రెడ్డి పోటీ చేశారు. అయితే ఈ పోటీలో తాను విజయం సాధిస్తానని ఈటల రాజేందర్ ధైర్యంగా ఉన్నారు.



**బండి సంజయ్**

బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో ఆయన భారత రాష్ట్ర సమితి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ పై అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఆ తర్వాత ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేసినప్పటికీ ఓడిపోయారు. ఈసారి కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి మళ్లీ పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ప్రత్యర్థిగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్ భారత రాష్ట్ర సమితి నుంచి పోటీ చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి వెలిచాల రాజేందర్ రావు కూడా పోటీ చేశారు. గత ఎన్నికల్లో ద్విముఖ పోరు ఉంటే.. ఈసారి త్రిముఖ పోరు ఉంది. అయితే ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని బండి సంజయ్ గట్టి నమ్మకంతో ఉన్నారు.



**ధర్మపురి అరవింద్**

నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ధర్మపురి అరవింద్.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఆ స్థానంలో అరవింద్ ఓడిపోయారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ధర్మపురి అరవింద్ మళ్లీ నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ధర్మపురి అరవింద్ కు ప్రత్యర్థిగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పోటీలో ఉన్నారు . అయితే ఈ ఎన్నికల్లో అటు జీవన్ రెడ్డి, ఇటు అరవింద్ తమ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



**జీవన్ రెడ్డి..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జీవన్ రెడ్డి సుదీర్ఘమైన అనుభవం ఉన్న రాజకీయ నేత. జగిత్యాల అసెంబ్లీ స్థానంలో పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఓడిపోవడంతో .. ఎమ్మెల్సీగా పోటీ చేశారు . ఆ ఎన్నికల్లో జీవన్ రెడ్డి విజయం సాధించారు.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ స్థానం నుంచి జీవన్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన నిజామాబాద్ స్థానం నుంచి పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. అయితే ఈ స్థానంలో తాను విజయం సాధిస్తానని జీవన్ రెడ్డి చెబుతున్నారు. జీవన్ రెడ్డికి ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటీ హోరాహోరీగా జరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



**కొప్పుల ఈశ్వర్**

గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పని చేశారు . ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ క్రమంలో పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుంచి భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.. సింగరేణి ఓట్లు అధికంగా ఉండే పెద్దపల్లి నియోజకవర్గం లో ఈసారి కచ్చితంగా తన గెలుస్తానని ఈశ్వర్ చెబుతున్నారు. మరోవైపు ఈశ్వర్ కు పోటీగా గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. వంశీకృష్ణ గడ్డం వివేక్ కుమారుడు.. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు దివంగత వెంకటస్వామి అలియాస్ కాకా కు మనవడు. అయితే ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని వంశీకృష్ణ చెబుతున్నారు.

# కొత్తగా 12,905 కోట్ల అప్పు

- ఆరు నెలల్లో కొత్తగా 12,905 కోట్ల రూపాయల అప్పు చేసిన రేవంత్ ప్రభుత్వం
- ఎఫ్ఆర్బీఎం పరిమితి గరిష్ట స్థాయికి చేరుకుంది
- కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందే ప్రయత్నం
- అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయవలసిన దుస్థితి
- ప్రభుత్వ భూములు అమ్మటానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు
- దుబారా గణనీయంగా పెరుగుతోంది
- రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం కోసం రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కోరిన ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



✍ జయభేరి, న్యూ డిల్లీ, మే 20:

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ ను సోమవారం సాయంకాలం బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ,ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ న్యూఢిల్లీలో కలిశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో లోక్సభ ఎన్నికల సంబంధించిన అంశాలను పోలింగ్ శాతం వివరాలను వివరించి కనీసం 10 స్థానాల్లో భారీ మెజారిటీతో బిజెపి అభ్యర్థులు గెలిచే అవకాశం ఉందని వివరించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ అనుకూల పవనాలు ఈసారి దక్షిణాదిలో కూడా చాలా బలంగా , గాలి వీస్తున్నది అని సాధారణ పౌరులు మాట్లాడుకుంటున్న విషయాలని, వివరాలని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు తిరగకముందే 12,905 కోట్ల రూపాయల అప్పు కొత్తగా చేసిందని .FRBM పరిమితి గరిష్ట స్థాయికి చేరుకుందని ప్రభాకర్ ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడ్జెట్ ఏతర రుణాల మీద దృష్టి సారించిందని, బహిరంగ మార్కెట్లో రుణాలు సేకరించడానికి సిద్ధమవుతుందని ఆర్థిక మంత్రి దృష్టికి ప్రభాకర్ తీసుకుని వెళ్లారు. గత ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రుణాలు పొందగా, ఇప్పుడు ఈ కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందటానికి ప్రయత్నం చేస్తుందని వివరించారు. ఈ చర్యలు ఆర్థిక పరిస్థితిని మరింత దిగదారుస్తుందని .అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడింది అని వారు వాపోయారు, ప్రభుత్వ భూములు అమ్మటానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారని మరిన్ని భూములు అమ్మడం కొరకు సిద్ధమవుతున్నారని తెలియజేశారు. రోజురోజుకీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు తగ్గుతున్నాయని ,అప్పులు మాత్రం గణనీయంగా పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నియమిస్తున్న సలహాదారుల ,కార్పొరేషన్ చైర్మన్ ల రాజకీయ నియామకాలు ప్రభుత్వ ఖజానా గుల్ల అవుతుందని ,దుబారా గణనీయంగా పెరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ఆర్థిక సంఘం స్థానిక సంస్థలకు అందిస్తున్న నిధులను కూడా ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తూ స్థానిక సంస్థలను కూడా నిర్వీర్యం చేస్తున్న అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం , ఆర్థిక క్రమశిక్షణ పాటించడం కొరకు రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించడం కొరకు ప్రయత్నించాలని కోరారు

# ఖర్చు పెట్టిన డబ్బుల కోసం హైడ్రామా

- అవిశ్వాసం నెగ్గలేక
- సుదీర్ రెడ్డి అనైతిక రాజకీయాలు
- తన స్వార్థం కోసం అమర్ సింగ్ ను ఆడిస్తున్నాడు
- బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్






**జయభేరి, మేడిపల్లి :**


పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పెట్టిన అవిశ్వాసం నెగ్గలేక కాంగ్రెస్ నాయకుడు సుదీర్ రెడ్డి అనైతిక రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మాట్లాడుతూ.. సుధీరన్ రెడ్డి స్వార్థం కోసం అమర్ సింగ్ ను పావుగా వాడుకొని క్యాంపుల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించాడని అన్నారు. అయితే పెట్టిన డబ్బులు బూడిదలో పోసిన కన్నీరు అవుతుందనే ఉద్దేశ్యంతోనే అమర్ సింగ్ హత్యా రాజకియాలకు పాల్పడుతున్నారన్నారు. అతనే తమ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై, మద్దతుగా ఉన్న కార్పోరేటర్లపై సుమారు 25 కార్లలో తీసుకువచ్చిన ప్రైవేటు గూండాలతో దాడులు చేయించి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఈ క్రమంలోనే ఔటర్ రింగు రోడ్డు పై అమర్ సింగ్ తీసుకువచ్చిన ప్రైవేటు గూండాలు, కొందరు కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలపై పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉండటంతో హస్పిటల్ పేరుతో హైడ్రామా చేస్తున్నాడని ఎద్దేవ చేశారు. సుదీర్ రెడ్డి కనుసన్నల్లో జరుగుతున్న ఈ వ్యవహారంలో అమర్ సింగ్ బలి పశువు అవుతాడని రఘువర్ధన్ జోస్యం చెప్పారు.

**గెలవ లేక గోల పెడుతున్నారు...**

మేయర్ వెంకట్ రెడ్డి మున్సిపల్ చట్టం నిబంధనలకు లోబడి తన బలంను నిరూపించుకునేందుకు తానే అవిశ్వాసం పెట్టారని, జూన్ 5వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్ తేదీ ఇవ్వడంతో ఎలాగు గెలవం అనే కాంగ్రెస్ నాయకులు గోల చేస్తున్నారని రఘు మండి పడ్డారు. సుదీర్ రెడ్డి ప్రలోభాలకు లొంగక పోవడంతో మా నాయకుడు వెంకట్ రెడ్డితో పాటు అతనికి మద్దతుగా ఉన్న కార్పోరేటర్లపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. అమర్ సింగ్ అండ్ కాంగ్రెస్ పెయిడ్ గ్యాంగ్ ఔటర్ రింగు రోడ్డుపై చేసిన హంగామా అంతా సీసీ టీవీ కెమెరాలతో దొరుకుతుందో అని ముందే వెళ్లి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ లో మేయర్ మరియు ఆయనకు మద్దతుగా ఉన్న కార్పొరేటర్ల పై తననే కిడ్నప్ చేయాలని ప్రయత్నించారు అని పిర్యాదు చేయడం దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉందన్నారు.

**ఘట్ కేసర్ పోలీసులకు ఫిర్యాదు...**

నిన్న రాత్రి 7.30 నిలకు బిఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ల పై దాడి మరియు కిడ్నప్ ప్రయత్నం సంఘటనపై ఈరోజు ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ లో పీర్జాదిగూడా కార్పొరేషన్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి సదరు అమర్సింగ్, అతని అనుచరుల పైన పిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. దాడులు చేసి ప్రలోభాలకు గురించే, బెదిరించి గద్దెనెక్కాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న రోజులలో ప్రజలే బుద్ధి చెబుతారు. కొందరి కాంగ్రెస్ పెద్దల చేతిలో పావుగా మారి అమర్ సింగ్ తన రాజకీయ భవిష్యత్తును ఆగం చేసుకుంటున్నాడన్నారు. విలేకరుల సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్,ఆంజనేయులు, బాలరాజు, కిరణ్, యాసారం శ్రీనివాస్, జోగి రెడ్డి, యూత్ అధ్యక్షులు పైళ్ల ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు మనోరంజన్ రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.



## బీరప్ప కామరతి కళ్యాణోత్సవం

**జయభేరి, మల్లాపూర్ :**

మల్లాపూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప కామరతి కళ్యణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కురుమలు నీతి నిజాయితీపరులని మాట తప్పనివారుగా కురుమలు ఉన్నారని, పదేళ్ల కెసిఆర్ ప్రభుత్వంలో కురుమలకు కెసిఆర్ ఉన్నత స్థానం కల్పించాడన్నారు. బీరప్ప దేవాలయాలు ఫంక్షన్ హాల్స్ కుల సంఘ భవనాలు ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి BRS కురుమలకు చేసిందని తిన్నరేవు తలిసే వారిగా కురుమలు ఉంటారన్న నమ్మకం సమాజంలో ఉందన్నారు. బీరప్ప కామరతి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నందుకు కురుమ కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున బంధువులతో నిర్వహించే పండుగలో ప్రేమాభిమానాలతో పాటు విలువలు భవిష్యత్ తరాలకు అందించడంలో బీరప్ప పండుగలు దోహదపడతాయన్నారు. హైదరాబాదు కోకా పేటలో 5 ఏకరాల్లో అత్యాధునిక కురుమల ఆత్మీయ భవనం దొడ్డి కొమురయ్య భవనం కెసిఆర్ కట్టించాడని కురుమలు నిత్యం కెసిఆర్ తో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హమాలీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప కళ్యాణమహోత్సవం



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ పట్టణంలోని శ్రీ బీరప్ప కామరాతి దేవి ఆలయంలో స్వామివారి జాతర మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప కామరాతి దేవి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఒగ్గు పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కురుమ సంఘం నాయకులు నాయకులు వారిని సన్మానించి జ్ఞాపికలు ఆందజేశారు. వేడుకల్లో కౌన్సిలర్లు కౌడె మహేశ్, స్వామి యాదవ్, శివకుమార్ యాదవ్, చాపరాజు, మున్సిపల్ వైస్ చైర్మెన్ రమేశ్, నాయకులు శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, రాఘవేందర్ గౌడ్, రంజిత్, రేగు రాజు తదితరులు పాల్గొన్నారు.



## గోవా అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ

**జయభేరి, దేవరకొండ :**

గోవా నందు అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలను G. సాయి కుమార్ నిర్వహించగా ఈ పొట్టిలలో 5దేశాల, 15 రాష్ట్రల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. నల్గొండ జిల్లా, దేవరకొండ పట్టణం, నుంచి అయుష్ కరాటే అకాడమీ విద్యార్థి పున్న శ్రీజన్ పోటీలలో పాల్గొని ఇండివిద్యుఅల్ కట విభాగం లో గోల్డ్ మెడల్ (ప్రథమ స్థానం), వెపన్ కట విభాగం లో సిల్వర్ మెడల్ (ద్వితీయ స్థానం)ను కైవసం చేసుకొనగా, విజేతగా నిలిచిన శ్రీజన్ ని సినీ హీరో, కరాటే లెజెండ్ డా. సుమన్ తల్వార్ మెడల్స్ ట్రోఫీ సర్టిఫికెట్ ను అందించారు. కరాటే పోటీలో పాల్గొనెల తల్లిదండ్రులను కిరణ్ కుమార్, భవాని దంపతులను అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయుష్ కరాటే అకాడమీ ఫౌండర్ & డైరెక్టర్ టి. చైతన్య తమ విద్యార్థులు అనేక జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పొట్టిలలో విజేతలుగా నిలుస్తు దేవరకొండ పట్టనానికే వాణ్ణెను తీచే విదంగా కష్టపడుతున్న విద్యార్థిని విద్యార్థుల విషయం చాలా సంతోషంగా ఉంది అని తెలియజేశారు.

## సేవ రత్న జాతీయ అవార్డు

- సయ్యద్ అజ్మతుల్లా (పాషా భాయ్)



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ చెందిన సయ్యద్ అజ్మతుల్లా (పాషా భాయ్) గతం 30 సంవత్సరాలగా వివిధ రంగాల్లో సేవలు చేసినందుకు గాను బహుజన సాహితి అకాడమీ వారు ఇతని సేవలను గుర్తించి సేవరత్న జాతీయ అవార్డు 2024 గాను ఎంపిక చేశారు. బహుజన సాహితి అకాడమీ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ మరియు బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు అహ్వాన పత్రాన్ని హైదరాబాద్లోనే బహుజన సాహితీ అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సంవత్సరం జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూణేల నిర్వహించే బహుజన రైటర్స్ నాలుగవ సమావేశం సందర్భంగా సేవ రత్న నేషనల్ అవార్డును అందజేయ నున్నట్లు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని ఈ కాన్ఫరెన్స్ లో మహారాష్ట్ర,మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరవుతారని తెలిపారు. ఈ అవార్డు సెలెక్ట్ చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ బహుజన అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి అవార్డును సెలెక్ట్ చేసినందుకుగాను మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సేవ చేస్తానని సయ్యద్ అజ్మతుల్ల తెలిపారు.

## కవితకు బిగ్ షాక్

అవెన్యూ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. దీంతో కోర్టు జూన్ 3 వరకూ రిమాండ్ ను పొడిగించింది. దీంతో రెండు దర్యాప్తు సంస్థల తరపున కవిత రిమాండ్ లో ఉన్నారు.కవిత బెయిల్ కోసం ఆమె తరుపు న్యాయవాదులు చాలా ప్రయత్నించారు. ఇప్పటికి పలుమార్లు ఆమెకు బెయిల్ రిజెక్ట్ అవుతూ ఉన్న విషయం తెలిసిందే.

# మల్లారెడ్డి యూనివర్సిటీలో హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సులు ప్రారంభం




**జయభేరి, మేడ్చల్:**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఆలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సులను ప్రారంభించినట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ వీ.ఎస్.కె రెడ్డి తెలిపారు. సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెల్త్ కేర్ కోర్సుల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 202425 విద్యా సంవత్సరానికి గాను ఆసక్తి గల గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు డాక్టరేట్ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మొదటిసారిగా యూనివర్సిటీలో పలు ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టినట్లు వివరించిన వీసీ యూజీ ప్రొగ్రామ్ లో బీఎస్సీ 4 ఏళ్ల కోర్సు, అనస్థీషియా, ఆపరేషన్ దియేటర్ టెక్నాలజీ, రేడియాలని వంటి వివిధ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్మీడియట్లో బైపీసీ చదివిన విద్యార్థులు అర్హులను వివరించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు, ఉపాధి అవకాశాలకు ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థుకు అవగాహన కల్పించారు. సమావేశంలో యూనివర్సిటీలోని పలు విభాగాల హెచ్ఐడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై గళమెత్తే వ్యక్తి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా దేవరకొండ పట్టణంలోని ఎల్ఐసి ఆఫీస్, ఎస్బిఐ బ్యాంకులో పట్టభద్రులను ఓటును రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలూ నాయక్ అభ్యర్థించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు మాట్లాడుతూ.. వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి బీజేపి అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి క్రమ సంఖ్య ఒకటిలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వ పక్షాన నిలిచి, దేశ యువత భవిత కోసం, భారతదేశ ప్రతిష్ఠను పెంచడం కోసం అవిశ్రాంతంగా పనిచేసే మోడీకి మద్దతునిచ్చే పట్టభద్రులుగా ఈ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రుల పక్షాన నిలబడి, మీ డిమాండ్లను నెరవేర్చడం కోసం, హక్కులను కాపాడడం కోసం పనిచేసే గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల వెంకటేష్ సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ పట్టణ ప్రధాన కార్యదర్శిలు జల్దా భాస్కర్, సముద్రాల సహదేవ్ పట్టణ ఉపాధ్యక్షులు గంజి హరి, బోడ శ్రీశైలం, కొమ్ము వెంకటయ్య, జెపి, బిక్షపతి తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రవీందర్ ను పరామర్శించిన హరీష్ రావు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీందర్ కుమార్ తండ్రి కనిలాల్ నాయక్ గత శనివారం అనారోగ్యంతో మరణించారు. రవీందర్ను, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరిష్ రావు పరామర్శించారు. కనిలాల్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.




## భయం వీడితే విజయం సొంతం

- పాల్త్య సహారాను అభినందించిన జిల్లా కలెక్టర్ హరిచందన
- క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర కృషితో చదువులో ముందడుగు వేయాలి



**జయభేరి, దేవరకొండ:**

దేవరకొండ లోగల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదివి ఇటీవల విడుదల అయిన ఎస్ఎస్సి ఫలితాలలో 10/10 జిపిఏ సాధించిన గుండ్లపల్లి మండలం, కళ్యా తండ గ్రామానికి చెందిన పాల్త్య గోపి కుమార్తె పాల్త్య సహారాకు నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన, నల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, ఏటిడిఓ లక్ష్మారెడ్డి, హాస్టల్ వార్డెన్ ఝాన్సీ రాణి కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందించారు. జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే భవిష్యత్తు బంగారు మాయమవుతుందని, భయం వీడితే విజయం సొంతమవుతుందని, విద్యార్థులు ఉన్నత విద్యావంతులై ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, సమాజానికి, మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. క్రమశిక్షణ సమయపాలన, నిరంతర కృషితో చదువులో ముందడుగు వేయాలని తెలిపారు.

## లీగల్ మెట్రోలజీ శాఖ ఆకస్మిక తనిఖీలు

- జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి పి రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో 12 కేసులు నమోదు



**జయభేరి, దేవరకొండ :**

ప్రపంచ మెట్రోలజీ డే సందర్భంగా నల్గొండ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ కె సిద్ధార్థ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి పి రామకృష్ణ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలోని దేవరకొండ కొండమల్లేపల్లి లోగల పలు పెట్రోల్ బంకులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం వినియోగదారులకు అవగాహన కల్పించారు. నల్గొండ ఇన్స్పెక్టర్ వి శ్రీనివాస్, నల్గొండ పట్టణంలోని పలు దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఐరన్ హార్డ్వేర్ మరియు సిమెంట్ వ్యాపారస్తులపై ప్యాకేజింగ్ రూల్స్ ఉల్లంఘించినందుకు గాను 12 కేసులు నమోదు చేయడం జరిగిందని, అంతేకాకుండా వ్యాపారస్తులు అమ్మే వస్తువులపై మ్యానుఫ్యాక్చరింగ్ అడ్రస్, రిటైల్ ప్రైస్, నెట్ క్వాంటిటీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, బెస్ట్ బిఫోర్ వంటి ప్యాకేజింగ్ నిబంధనలను పాటించకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ పి రామకృష్ణ హెచ్చరించారు. పెట్రోల్ బంక్ వ్యాపారస్తులు వినియోగదారుల కోరిక మేరకు అక్కడికక్కడే 5 లీటర్ల క్యాంతో వారి సమక్షంలో డెలివరీలు చెక్ చేసి చూపించాల్సిందిగా ఈ సందర్భంగా వారు తెలిపారు.



## కొత్తగా కలకలం సృష్టిస్తున్న చుడీదార్ గ్యాంగ్

జయభేరి, హైదరాబాద్ మే 20:

హైదరాబాద్‌లో చెడ్డి గ్యాంగ్ తరహాలో కొత్తగా చుడీదార్ గ్యాంగ్ కలకలం సృష్టిస్తుంది. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి జెక్ కాలనీలోని ఆకృతి ఆర్కేడ్ అపార్ట్ మెంట్‌లో దుండగులు చుడీదార్ వేసుకొని దొంగతనానికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్ రావు అనే వ్యక్తి ఇంట్లో 4 తులాల బంగారం, రూ. లక్ష నగదు, ల్యాప్ టాప్ ను చుడీదార్ వేసుకున్న గ్యాంగ్ దొంగతనం చేసింది. ఇద్దరు దుండగులు చుడీదార్ ధరించి దొంగతనానికి పాల్పడిన వీడియో సిసి టివి ఫుటేజీలో నిక్షిప్తమైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ఇరాన్ అధ్యక్షుడు దుర్మరణం

ప్రధాని మోడీ సంతాపం



అజర్ బైజాన్ దేశ పర్యటన ముగించుకుని ఇరాన్ తిరిగి వెళ్తుండగా ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం రైసీ, విదేశాంగ మంత్రి హొస్సేన్ అమిరబ్దొల్లాహియాన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పర్వతాల్లో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో అధ్యక్షుడు సయ్యద్ తో పాటు మరో ఐదుగురు కూడా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం రైసీ యొక్క విషాద మరణం, పట్ల భారత ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్ ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అతని కుటుంబానికి, ఇరాన్ ప్రజలకు నా హృదయపూర్వక సానుభూతి. ఈ విషాద సమయంలో భారత్ ఇరాన్‌కు అండగా నిలుస్తోందని ప్రధాని మోడీ తన ట్వీట్ లో తెలిపారు.

## మేడారం ఆలయ అధికారులు కీలక ప్రకటన



జయభేరి, మేడారం:

మేడారం తాడ్వాయి మేడారంలోని, వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ఈ నెల 29. 30 తేదీల్లో మూసివేస్తున్నట్లు పూజారులు ప్రకటించారు. స్థల కేటాయింపు పై ప్రభుత్వం, దేవాదాయ అధికారుల తీరును నిరసిస్తూ ఆ తేదీల్లో ప్రాంగణం వద్ద ధర్నా నిర్వహించనున్నామని ఆదివారం వెల్లడించారు. 1993లో మేడారం జాతర భవిష్యత్తు అవసరాల కోసం వరంగల్‌లోని కేంద్ర కారాగారానికి ఎదురుగా 1000, గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఇందులో ఏడాది క్రితం భద్రకాళి, మెట్టుగుట్ట, మేడారం జాతర నిధులతో ధార్మిక భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని, స్థలాన్ని భద్రకాళి దేవస్థానం అధీనంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, స్థలం వనదేవతలదని నిర్మాణ ఖర్చులను జాతర ఆదాయం నుంచి ఇస్తామని, స్థలం, భవనం అప్పగించాలని పూజారులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మంత్రి సీతక్క, కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులకు వినతిపత్రాలిచ్చినా స్పందన లేకపోవడంతో గద్దెలు, ప్రాంగణానికి తాళాలు వేసి, ధర్నా నిర్వహించనున్నామని పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు తెలిపారు.


## కేటీఆర్ పై ఈసీ చర్యలు

జయభేరి, హైదరాబాద్, బే 20:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. మే 13న రాష్ట్రంలో పార్లమెంట్ ఎలక్షన్ పోలింగ్ రోజున మాజీ మంత్రి కేటీఆర్ నిబంధనలు ఉల్లంఘించారని ఈసీ చర్యలకు సిద్ధమైంది. ఎన్నికల రోజున మాట్లాడిన కేటీఆర్ తాను ఏ వ్యక్తికి ఓటు వేశారో పరోక్షంగా వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొంటూ కేటీఆర్‌పై చర్యలకు ఈసీ ఆదేశించింది. ఈ విషయంపై ఈసీ ఇదివరకే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని గడువు ఇవ్వగా, కేటీఆర్ వివరణ ఇవ్వకపోవడంతో ఈసీ చర్యలకు ఆదేశించింది.

# కుటుంబానికి రూ. 50,000/- ఆర్థిక సహాయం

- ఇద్దరు పిల్లలు మస్కులర్ డిస్ట్రోఫీ(కండరాల బలహీనత) వ్యాధి తో బాధపడుతున్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన తెలంగాణకు చెందిన ఫ్రీమేసన్ సభ్యులు
- పిల్లలు జీవించి ఉన్నంత వరకు నిరంతర నెలవారీ ఆర్థిక, వస్తుపరమైన సహాయానికి హామీ ఇచ్చిన ఫ్రీమేసన్స్ సంస్థ సభ్యులు
- డాక్టర్ సత్య భామ, క్రికెటర్ VVS లక్ష్మణ్ తల్లి, మస్కులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న ఇద్దరు పిల్లలను పెంచుతున్న తల్లి బొక్క పద్మ తో పాటు మరో ఇద్దరు అద్భుతమైన మహిళలను సత్కరించారు.




జయభేరి, హైదరాబాద్, మే 20:

తెలంగాణకు చెందిన ఫ్రీమేసన్స్ ఆదివారం అర్ధరాత్రి జరిగిన కార్యక్రమంలో బొక్క పద్మ, నరసింహా రెడ్డిల కుటుంబానికి రూ. 50,000/(యాభై వేల రూపాయలు) చెక్కును అందించారు. వీరి ఇద్దరు పిల్లలు బొక్క తేజ వర్ధన్, 20 ఏళ్లు, బొక్కా మణి వర్ధన్, 17 ఏళ్లు. ఘట్‌కేసర్‌లోని యమ్నాపేట్ గ్రామం చాలా సంవత్సరాలుగా నయం చేయలేని కండరాల బలహీనతతో బాధపడుతున్నారు.
తెలంగాణలోని ఫ్రీమేసన్స్ యొక్క అసిస్టెంట్ రీజినల్ గ్రాండ్ మాస్టర్లు ప్రొద్దుటూరు వీరభద్రుడు, డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, అనిల్ దేశాయ్, రమేష్ మంచాల మదర్స్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న కుటుంబానికి నిరంతరం నెలవారీ ఆర్థిక, మెటీరియల్ (అవసరానికి అనుగుణంగా కిరాణా) అందజేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలు జీవించి ఉన్నంత కాలం మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఫ్రీమేసన్స్ ఒక ప్రపంచ సంస్థ. ఇది విలువలను పెంపొందించే సంస్థ. ఇది మంచి పురుషులను మరింత మెరుగుపరుస్తుంది అని అన్నారు ప్రొద్దుటూరు వీరభద్రుడు. గత వారం, యమ్నాపేట్ గ్రామంలోని కుటుంబాన్ని సందర్శించి, వారి పరిస్థితిని అధ్యయనం చేసి, వారి అవసరాన్ని అంచనా వేసి, ఫ్రీమేసన్‌లు, వారి కుటుంబాలు, స్నేహితులు, బంధువులు, వ్యాపార సహచరులు, దాతృత్వ వ్యక్తులు మరియు మంచి సమరిటన్‌లకు విజ్ఞప్తి చేసి వారి సహకారం ద్వారా డబ్బు సేకరించాము. గత కొన్నేళ్లుగా తన భర్త నర్సింహారెడ్డితో పాటు ఇద్దరు కుమారులను పోషించుకుంటున్న బొక్క పద్మకు చెక్కును అందించారు. అటువంటి నయం చేయలేని వ్యాధితో బాధపడుతున్న తన కొడుకులిద్దరికి అహర్నిశలు సేవ చేస్తూ, చిన్న ఉద్యోగం చేస్తూ పిల్లలకు మంచి జీవనాన్ని అందించాలని ఆమె చేస్తున్న కృషి, సంకల్పానికి బొక్క పద్మ కూడా గౌరవించబడ్డారు. ఆమె ఒక అపురూపమైన తల్లి అని డి. రాంచంద్రం, ఫ్రీమేసన్ సభ్యుడు ఆ కార్యక్రమానికి సంధాన కర్త తెలిపారు. ఇద్దరు అబ్బాయిలు కండరాల పనితీరును బలహీనపరిచే అరుదైన జన్యు వ్యాధి అయిన మస్కులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్నారు. ఈ కారణంగా వారు నడవడానికి, కూర్చోవడానికి, నిలబడే సామర్థ్యాన్ని కోల్పోయారు. వారు కేవలం మంచం మీద ఉన్నారు. చికిత్స లేదా నివారణ లేదు. వారికి 24 గంటల సహాయం కావాలి.
పద్మ భర్త, డ్రైవర్ నరసింహారెడ్డి ఉద్యోగం కోల్పోయాడు. పిల్లల సంరక్షణ కోసం ఇంట్లోనే ఉంటాడు. పద్మ కూలికి వెళ్లి 8000/సంపాదిస్తుంది, ఇది పిల్లలను పోషించడానికి, ఇంటిని నడపడానికి సరిపోదు. వారికి ఆసరా పింఛన్ వచ్చినా సరిపోవడం లేదన్నారు. పద్మ తన పిల్లలిద్దరినీ బ్రతికున్నంత కాలం సంతోషంగా ఉంచాలనుకుంటోంది. అందుకే తెలంగాణకు చెందిన ఫ్రీమేసన్స్ ముందుకు వచ్చి మాతృ దినోత్సవ వేడుకల్లో గోషామహల్‌లోని గోషామహల్ బారాదరి మేసోనిక్ భవనంలో జరిగిన కార్యక్రమంలో చెక్కును అందజేశారు. పద్మతో పాటు, వారి పిల్లల విజయానికి వెనుక ఉన్న మరో ముగ్గురు అద్భుతమైన మహిళలు కూడా గౌరవించబడ్డారు. వారిలో ప్రముఖ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తల్లి డాక్టర్ సత్య భామ కూడా ఉన్నారు. గౌరవించబడిన మరో ఇద్దరు అద్భుతమైన తల్లులు విమ్లా దుర్వేష్ అహీర్, బోయపాటి సుభాషిణి. తెలంగాణకు చెందిన ఫ్రీమేసన్స్ కూడా తమ సభ్యుల తల్లులను సన్మానించారు. కొందరు సభ్యులు తమ తల్లులతో తమ బంధాన్ని, జ్ఞాపకాలను, నేర్చుకున్న పాఠాలను, తల్లుల త్యాగాలను పంచుకున్నారని మరో ఫ్రీమేసన్ సభ్యుడు గన్నారపు అశోక్ తెలియజేశారు. దాని ప్రాంతీయ గ్రాండ్ మాస్టర్ TN మనోహరన్ ఇచ్చిన పిలుపు మేరకు దక్షిణ భారతదేశంలోని 126 నగరాల్లో మదర్స్ డే జరుపుకున్నారు. ఫ్రీమేసన్స్ మదర్స్ డే నిర్వహించడం ఇదే మొదటిసారి. ఫ్రీమేసన్స్ ఇప్పటివరకు యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డేని మాత్రమే జరుపుకుంటున్నారు. మనందరి జీవితంలో అమ్మ ఒక ప్రత్యేకమైన వ్యక్తి. ఫ్రీమేసన్రీ కూడా చాలా ప్రత్యేకమైన సంస్థ. తల్లి తన పిల్లలను మంచి మనుషులుగా తీర్చిదిద్దుతుంది. ఫ్రీమేసన్రీ కూడా అంతే. ఇది మంచి పురుషులు ను మరింత మెరుగైన వారిని చేస్తుంది ఒక తల్లి పాత్ర బేషరతుగా ప్రేమించడం. శారీరకంగా, మానసికంగా చేస్తుంది. సరైన క్రమశిక్షణ, శిక్షణ, ప్రోత్సహించడం, బోధించడం చేస్తుంది. ఫ్రీమేసన్రీ విషయంలో కూడా అదే జరుగుతుంది. ఫ్రీమేసన్రీ ఇంట్లో దయ, ఒకరి పట్ల మరొకరికి ప్రేమ, సమాజంలో మర్యాద, చెడు పట్ల ప్రతిఘటన, బలహీనుల పట్ల సహాయం, అభాగ్యుల పట్ల జాలి, శ్రద్ధ, పశ్చాత్తాపం, పనిలో నిజాయితీ, వ్యాపారంలో నిజాయితీ, అన్నింటికంటే, భక్తిని బోధిస్తుంది. దేవుని పట్ల ప్రేమ. ఫ్రీమేసన్రీ అనేది ఒక జీవన విధానం. ఇది విలువలను బోధిస్తుంది. మంచి వ్యక్తులను మెరుగైన వ్యక్తులుగా ఎదగడానికి దోహద పడుతుంది. లాడ్జ్ (క్లబ్) అనేది పాఠశాల, కళాశాల లాంటిదని, మానవాళికి ఉపయోగపడేది నేర్పుతుందని డి.రాంచంద్రం తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీమేసన్స్ వారు 'మాతృత్వం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో 100 మందికి పైగా సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, అతిథులు పాల్గొన్నారు.





# ఎవరి విద్యార్హత ఎంత?

- పట్టభద్ర ఓటర్లు ఆలోచించి విద్యావంతులకు ఓటు వేసి చట్టసభలకు పంపాలి..
- ప్రజాస్వామ్య పరిరక్షణలో బాధ్యతగా వ్యవహరించాలి..
- నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా చట్టంపై పూర్తి అవగాహన ఉన్న వారిని ఎన్నుకోవాలి

జయభేరి, హైదరాబాద్ :

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల విద్యార్హతలు... ఈ నెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పట్టభద్రుల నియోజక వర్గం అంటేనే విద్యావంతులు పోటీ చేస్తారని అందరికి తెలిసిన విషయమే. శాసన మండలికి ఎన్నికయ్యే అభ్యర్థి ప్రభుత్వం చేయబోయే పాలసీలు, చట్టాలలో వీరి పాత్ర కూడా ఉంటుంది. విద్యావంతులకు ప్రాతినిధ్యం వహించే ఈ అభ్యర్థుల విద్యార్హతలను ఓటర్లకు తెలియజేయాలని జయభేరి పత్రిక వీరి విద్యార్హతలను ప్రచురిస్తున్నాము. వీరిలో 12వ క్రమసంఖ్యలో ఉన్న అలయెన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ పార్టీకి చెందిన ఈడా శేషగిరి రావు గౌడ్ అత్యధిక విద్యార్హతలను (M.Sc, B.Ed, LL.M, Ph.D) కలిగి ఉన్నారు. మొత్తం మీద ఐదుగురు డాక్టరేట్లు, 29 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మిగతావారు గ్రాడ్యుయేట్లు, ఇద్దరు 10వ తరగతి, ఒకరు ఐటిఐ చదివిన వారు ఉన్నారు.

**Warangal-Khammam-Nalgonda Graduates' Constituency Bye-Elections 2024**
**List of Contesting Candidates & their Educational Qualifications**

| Sl.No. | Name of Candidate | Party Affiliation | Qualifications |
|---|---|---|---|
| 1 | Gujjula Premendar Reddy | Bharatiya Janata Party | M.A., LL.B. |
| 2 | Teenmar Mallanna | Indian National Congress | M.B.A. |
| 3 | Anugula Rakesh Reddy | Bharat Rashtra Samithi | M.B.A. |
| 4 | Karne Ravi | National Nava Kranthi Party | M.A., B.Ed. |
| 5 | Gandala Jyothi | Telangana Republican Party | M.A., LL.B. |
| 6 | Chenna Srikanth | Social Justice Party of India | M.A. |
| 7 | Jajula Bhaskar | Shramajeevi Party | B.A. |
| 8 | Janaiah Nandipati | Telangana Sakalajanula Party | B.A. |
| 9 | Pati Srikanth Reddy | Prajavani Party | B.Tech. |
| 10 | Pusa Srinivas | Telangana Rashtra Punarniramana Samithi | M.A. |
| 11 | Barigela Durgraprasad Maharaj | Dharma Samaj Party | M.A., M.C.J. |
| **12** | **Dr. Eada Seshagiri Rao Goud** | **Alliance of Democratic Reforms Party** | **M.A., B.Ed., LL.M., Ph.D.** |
| 13 | Dr. Deshagani Sambashiva Phule | Blue India Party | Ph.D. |
| 14 | Sode Venkateswarlu | Gondwana Dandkaranya Party | M.A., LL.M. |
| 15 | Anil Kumar Gadepaka | Independent | M.T.M. |
| 16 | Ambala Rajesh | Independent | M.Ped. |
| 17 | Telu Anna Ravi Yadav | Independent | M.A., B.Ed. |
| 18 | Ashok Kumar Palakuri | Independent | M.A., B.Ed. |
| 19 | A S Krishna | Independent | B.A. |
| 20 | Ithagoni Raghavendra | Independent | B.Sc. |
| 21 | Kante Sayanna | Independent | M.A. |
| 22 | Krishnam Raju Mendem | Independent | B.A., B.Ed. |
| 23 | Kodirekka Uma Shankar | Independent | M.Sc., MSW |
| 24 | Dr. Gadam Mallesh | Independent | M.Tech., Ph.D. |
| 25 | Guguloth Bheema | Independent | I.T.I. |
| 26 | Chandra Kranthi Kumar | Independent | M.Sc. |
| 27 | Chalika Chandra Sekhar | Independent | B.Sc. |
| 28 | Cheedella Uma Maheshwari | Independent | B.Tech. |
| 29 | Cheruku Shiva Kumar Goud | Independent | B.E., LL.B. |
| 30 | Janga Sujatha | Independent | B.Sc. |
| 31 | Jallarapu Ramesh | Independent | B.A. |
| 32 | Jillapalli Venkata Syam Prasad | Independent | M.A. |
| 33 | Thadishetty Kranthi Kumar | Independent | M.C.A. |
| 34 | Tejavath Vasudev | Independent | B.Tech. |
| 35 | Dayakar Gajji | Independent | B.LiSc., M.A., LL.B. |
| 36 | Dunuku Veladri | Independent | M.Phil. |
| 37 | Pidishetti Raju | Independent | B.Sc., B.Ed. |
| 38 | Pujari Satyanarayana | Independent | M.Sc. |
| 39 | Pettem Mallikarjun | Independent | S.S.C. |
| 40 | Dr. Penchala Srinivas | Independent | Ph.D. |
| 41 | Bakka Judson | Independent | B.A. |
| 42 | Bugga Sreekanth | Independent | M.A. |
| 43 | Boora Muthilingam | Independent | Ph.D. |
| 44 | Bhairavabhotla Srinivas Rao | Independent | B.Com |
| 45 | Madhavapeddi Venkat Reddy | Independent | B.Sc. |
| 46 | Maram Venkat Reddy | Independent | S.S.C. |
| 47 | Mundra Mallikarjun Rao | Independent | LL.M. |
| 48 | Mohan Reddy Konkala | Independent | B.Sc. |
| 49 | Yathakula Shekar | Independent | M.A. |
| 50 | Raju Nayak Gugulothu | Independent | M.A. |
| 51 | Guguloth Santhosh | Independent | B.Com. |
| 52 | Sunkari Lingaiah | Independent | M. Pharm. |

## ఏసీబీ వలలో కమలాపూర్ తహసీల్దార్ మాధవి

జయభేరి, హన్మకొండ;

హన్మకొండ జిల్లా కమలాపూర్ తహసీల్దార్ మాధవి ఏసీబీ వలలో చిక్కారు..ఒక రైతు వద్ద లంచం తీసుకుంటూ మాధవి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయారు.ఈ నేపథ్యంలో కమలాపూర్ తహసిల్దార్ ఆఫీస్ లో ఏసీబీ సోదాలు సోమవారం నాడు కొనసాగాయి. కమలాపూర్ మండలం కన్నూరు గ్రామం కు చెందిన కసరబోయిన గోపాల్ దగ్గర విరాసత్ రిజిస్ట్రేషన్ కోసం 30000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ. ముందుగా 5,000 రూపాయలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్టు సమాచారం . ఎసిబీ అధికారులు పూర్తి క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

## 14మంది నక్సల్స్ అరెస్ట్

జయభేరి, బీజపూర్ మే 20 :

మొత్తం 41 లక్షల రివార్డు కలిగి ఉన్న 14మంది నక్సల్స్ ఛత్తీస్‌గడ్ లోని బీజపూర్ జిల్లాలో అరెస్ట్ అయ్యారని బీజపూర్ పోలీస్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారని తెలిపారు. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని ముత్వెండి అటవీ ప్రాంతం, పిడియా గ్రామాల్లో ఆదివారం డిఆర్‌జి, జిల్లా పోలీస్‌ల సంయుక్త బృందం వీరిని పట్టుకోగలిగిందని చెప్పారు. 14 మంది నక్సల్స్‌లో రేణు కొసవి , మంగ్లీ అవ్లంలకు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ఉంది. వీరిద్దరూ మిలిటరీ కంపెనీ నెంబరు 2 కు చెందిన వారు. గంగలూరు ఏరియా కమిటీ సభ్యులు బిచ్చెం యుయికా, షర్మిలా కుర్సం, లక్ష్మీతాటి ఒక్కొక్కరిపై రూ. 5 లక్షల రివార్డు ఉంది.మరో నలుగురు క్యాడర్లకు రూ. 2లక్షల వంతున, మిగతా ఇద్దరికి లక్ష వంతున రివార్డులు ఉన్నాయని పోలీస్‌లు ప్రకటనలో వివరించారు. వారి దాచి ఉంచిన నాలుగు టిఫిన్ బాంబులు, రెండు కుకర్ బాంబులు, డిటొనేటర్లు, కార్డెక్సు వైర్, జిలటిన్ స్టిక్స్, ఫైర్‌క్రాకర్లు, మావోయిస్టుల సంబంధిత మెటీరియల్ వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 10న ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్‌ను హతమార్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి వివరాలు పోలీస్‌లు ఇంకా తెలియజేయలేదు. అయితే ఈ ఎన్‌కౌంటర్ బూటకమని గ్రామస్థులు, ఉద్యమకారులు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను పోలీస్‌లు కొట్టి పారేశారు. వీరందరి తలపై నగదు బహుమతులున్నాయని వివరించారు.




**రెండు నెలలుగా క్రికెట్ అభిమానులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతున్న ఐపీఎల్ 17 నాకౌట్ దశకు చేరుకుంది. క్వాలిఫయర్1లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్ వేదికగా టేబుల్ టాపర్ కోల్‌కతా.. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్‌ను ఢీకొననుంది.**

# నేరుగా ఫైనల్లో అడుగు పెట్టేదెవరో?

కోల్‌కతాతో హైదరాబాద్ కీలక పోరు
గెలిస్తే నేరుగా ఫైనల్‌కు అర్హత
రాత్రి 7:30 గంటలకు

రెండు నెలలుగా క్రికెట్ అభిమానులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతున్న ఐపీఎల్ 17 నాకౌట్ దశకు చేరుకుంది. క్వాలిఫయర్ 1లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్ వేదికగా టేబుల్ టాపర్ కోల్‌కతా.. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్‌ను ఢీకొననుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం ఉండటంతో మరో మ్యాచ్ (క్వాలిఫయర్ 2) ఆలోచన లేకుండా ఇరు జట్లూ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. సీజన్ ఆసాంతం నిలకడగా రాణిస్తూ సమిష్టి ప్రదర్శనలతో ప్లేఆఫ్స్ చేరిన ఈ రెండు జట్లలో మ్యాచ్ విన్నర్లకు కొదవలేకపోవడంతో మోతేరా స్టేడియంలో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఈ సీజన్‌లో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీ అయిన ఫిల్ సాల్ట్‌సునీల్ నరైన్ బాదుడుకు బలికాని ప్రత్యర్థి లేరంటే అతిశయోక్తి లేదు. కానీ ప్లేఆఫ్స్‌లో కేకేఆర్‌కు సాల్ట్ లేకపోవడం ఎదురుదెబ్బే. జాతీయ జట్టు (ఇంగ్లండ్) బాధ్యతల నిమిత్తం అతడు కోల్‌కతాను వీడాడు.ఈ నేపథ్యంలో కేకేఆర్ టాప్ స్కోరర్ నరైన్ (461) పై మరోసారి భారీ ఆశలే పెట్టుకుంది. అతడిని త్వరగా ఔట్ చేస్తే మిడిలార్డర్ కూడా తడబడుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నా అతడూ ప్రమాదకారే. వెంకటేశ్ అయ్యర్, నితీశ్ రాణా నిలకడకు తోడు ఆఖర్లో ఆండ్రీ రస్సెల్ మెరుపులు మెరిపిస్తే హైదరాబాద్‌కు తిప్పలు తప్పవు. ఆడేది తక్కువ బంతులే అయినా రమణ్‌దీప్ సింగ్ భారీ హిట్టింగ్‌లతో కీలక పరుగులు రాబడుతున్నాడు. కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ బౌలింగ్ దళం వీళ్లను ఎలా కట్టడి చేస్తుందన్నది ఆసక్తికరం. హైదరాబాద్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన ట్రావిస్ హెడ్ (533 పరుగులు), అభిషేక్ శర్మ (467) ఎలా ఆడతారన్నదానిపైనే సన్‌రైజర్స్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ విజయాలలో వీరిదే అగ్రతాంబూలం అని చెప్పక తప్పదు. ఈ ఇద్దరూ తొలి 8 ఓవర్ల పాటు క్రీజులో నిలిస్తే స్టార్క్ అండ్ కో.కు బడిత పూజ తప్పదు. మూడో స్థానంలో రాహుల్ త్రిపాఠికి మరోసారి అవకాశం దక్కితే అది జట్టుకు మేలు చేసేదే. వైజాగ్ కుర్రాడు నితీశ్ రెడ్డి అంచనాలకు మించి రాణిస్తుండటం ఎస్ఆర్‌హెచ్‌కు అదనపు బలం. పంజాబ్‌తో మ్యాచ్‌లో క్లాసెన్ ఫామ్‌లోకి రావడం హైదరాబాద్‌కు శుభసూచకమే. అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామమే అయినా గత 12 మ్యాచ్‌లలో ఇక్కడ 200+ స్కోర్లు నమోదైంది రెండు సార్లే. రెండో సారి బ్యాటింగ్ చేసే జట్టుకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**తుది జట్లు (అంచనా):**
కేకేఆర్: నరైన్, గుర్బాజ్, శ్రేయస్ (కెప్టెన్), వెంకటేశ్, నితీశ్, రింకూ, రస్సెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్, చక్రవర్తి
ఎస్ఆర్‌హెచ్: హెడ్, అభిషేక్, త్రిపాఠి, నితీశ్, క్లాసెన్, షాబాజ్, సమద్, సన్వీర్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్




# టీఎస్ఆర్జెసీ ఫలితాల్లో ఎస్వీఎన్ జయకేతనం

**జయభేరి, యాదగిరిగుట్ట :**
యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు టీఎస్ఆర్ జె సీ లో సీట్లు సాధించడం పట్ల ఎస్.వీ.ఎన్ ఫౌండర్, కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, డైరెక్టర్ గొట్టిపర్తి వృతీక్ హర్షం వ్యక్తం చేశారు.


ఈ సందర్భంగా టి.ఎస్.ఆర్.జె.సీ లో సీట్లు సాధించిన తాడూరి కౌశిక్, ముక్కెర్ల శివాని, మాలోతు మురారి, దొడ్డి రోహిత్ కళాధర్, గుగులోతు గౌరీ, నారా అంబిక లను ఆదివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించి సన్మానించారు. చక్కటి ప్రణాళికతో పదో తరగతి విద్యార్థులను పోటీ పరీక్షలకు తయారు చేయడం వల్లనే టీఎస్ఆర్ జెసి లో ర్యాంకులు సాధించగలిగారని ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ చెప్పారు. పటిష్టమైన ప్రణాళిక విద్యార్థులను విజయానికి చేరువ చేసిందని చెప్పారు. పదవ తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత కావడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే







పోటీ పరీక్షల్లో ఎస్.వీ.ఎన్ జయకేతనం ఎగురవేస్తున్నదని ఆయన హర్షం వ్యక్తం చేశారు. టీఎస్ ఆర్ జె సి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావడానికి ఎస్.వీ.ఎన్ విద్యార్థులకు మొట్టమొదటగా 10వ తరగతి ప్రారంభం నుంచి శిక్షణ ఇవ్వడం ప్రారంభించామని చెప్పారు. పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్ తదితర పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు వారు వివరించారు. మారుమూల గ్రామీణ పేద విద్యార్థులు జయకేతనం ఎగరవేయడంలో వారి పట్టుదల ఒకవైపు ఉపాధ్యాయుల శిక్షణ మరో కారణమని అభినందించారు. 28 సంవత్సరాలలో ఎస్.వీ.ఎన్ ఎన్నో విజయాలను అందుకున్నదని చెప్పారు. ఈ సంవత్సరం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో కూడా తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించనున్నారని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎండి. యూసుఫ్,ఎస్. నవీన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అందం కోసం

**చర్మాన్ని మెరిసేలా చేసేందుకు రసాయన ఉత్పత్తులు వాడకండి. సహజ పదార్థాలు మిమ్మల్ని మెరిసేలా చేస్తాయి. అందులో తేనె, కలబంద జెల్ ఎంతగానో ఉపయోగపడుతుంది.**

చర్మానికి అనేక రకాల సమస్యలు ఉంటాయి. చాలా మంది ఫిర్యాదు చేసే విషయాలలో ఒకటి మొటిమల బారిన పడే చర్మం. ఇది మీ ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తుందనడంలో సందేహం లేదు. చర్మం సహజ రంగును తిరిగి పొందాలని చాలా మంది ప్రయత్నిస్తారు. కానీ చాలా మందికి పరిష్కారం ఏంటో తెలియదు. ఏం చేయాలో అర్థంకాదు. ఇప్పుడు మీరు మొటిమలు, ఇతర చర్మ సమస్యలను వదిలించుకోవడానికి అలోవెరా, తేనె ఫేస్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు.
చర్మ సంరక్షణలో కలబంద, తేనె ప్రధాన పాత్ర పోషిస్తాయనడంలో సందేహం లేదు. కానీ వాటిని వాడుతున్నప్పుడు చర్మంలో ఎలాంటి మార్పులు వస్తాయో చాలా మందికి తెలియదు. కనీసం ఒక వారం పాటు దీన్ని మీ ముఖానికి వాడితే, తేడాను గమనించవచ్చు. అది ఎలా జరుగుతుందో చూద్దాం.

**వారం రోజులు వాడండి :** మెరిసేందుకు మనం ఫేస్‌ప్యాక్‌ని ఉపయోగిస్తాం. దాని కోసం మీరు అలోవెరా జెల్ తీసుకుని అందులో ఒక చెంచా తేనె మిక్స్ చేసి చక్కని పేస్ట్ లా చేసుకోవచ్చు. దీన్ని చర్మానికి పట్టించి కాసేపటి తర్వాత కడిగేయాలి. వాషింగ్ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్బును ఉపయోగించకూడదు. ఇది చర్మంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇలా వారానికి 7 రోజులు క్రమం తప్పకుండా చేయడం వల్ల చర్మంలో అద్భుతమైన మార్పు వస్తుంది.

**చర్మ సమస్యలు తొలగిపోతాయి :** ఈ ఫేస్ ప్యాక్ చర్మంలోని బ్లాక్ హెడ్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. సూర్యకాంతి వల్ల వచ్చే చర్మపు చికాకులను ఈ ఫేస్ ప్యాక్‌తో పరిష్కరించవచ్చు. ఈ మిశ్రమం అన్ని చర్మ సమస్యల నుండి బయటపడటానికి, చర్మం సహజ రంగును పునరుద్ధరించడానికి సహాయపడుతుంది. దీని వల్ల చర్మ సమస్యలన్నీ తొలగిపోతాయి. ఇది ముఖాన్ని మాత్రమే కాకుండా మెడను కూడా మెరిసిపోయేలా చేస్తుంది.

**పొడి చర్మం పోతుంది :** ఇది అన్ని చర్మ సమస్యలను పూర్తిగా తొలగిస్తుంది. పొడి చర్మాన్ని నయం చేస్తుంది. దీన్ని రోజూ వాడితే రెట్టింపు ఫలితాలు వస్తాయనడంలో సందేహం లేదు. కలబందలోని గుణాలు చర్మానికి మాయిశ్చరైజింగ్ లక్షణాలను అందిస్తాయి. దీన్ని రెగ్యులర్‌గా ఉపయోగించవచ్చు.

**బ్లాక్ హెడ్స్ ఉండవు :** ఈ ఫేస్ ప్యాక్ ను బ్లాక్ హెడ్స్ వదిలించుకోవడానికి కూడా ఉపయోగించవచ్చు. ముక్కు, బుగ్గల వైపులా దీన్ని రెగ్యులర్ గా అప్లై చేయడం వల్ల చర్మంలోని బ్లాక్ హెడ్స్ పూర్తిగా తొలగిపోతాయి. కేవలం రెండు మూడు రోజుల్లోనే బ్లాక్ హెడ్స్ ను పోగొట్టుకోవడానికి ఈ రెమెడీని ప్రయత్నించవచ్చు. సమస్య నుండి విముక్తి పొందడానికి మనం కలబంద తేనె మిశ్రమాన్ని క్రమం తప్పకుండా వాడవచ్చు. ఇది మీలో అనేక అనుకూలమైన చర్మ మార్పులను కలిగిస్తుంది. ఈ ఫేస్ ప్యాక్ మొటిమలు, మచ్చలను పూర్తిగా వదిలించుకోవడానికి సహాయపడుతుంది. రోజూ వాడటం వల్ల చర్మంలో అనేక మార్పులు వస్తాయి. ముఖంలో వచ్చే మార్పులను చాలా త్వరగా మీరు అర్థం చేసుకోవచ్చు. అదే ఈ ఫేస్ ప్యాక్ ప్రత్యేకత. దీనిని వారం రోజులు వాడితే మీ ముఖం మెరిసిపోతుంది.



# మూవీభేరి



## గాడ్‌ఫాదర్ దర్శకుడితో ఇంకోసారి చిరంజీవి

చిరంజీవి 'గాడ్‌ఫాదర్' సినిమా చూసినవారం దరూ దర్శకుడు మోహన్‌రాజా స్టైలిష్ మేకింగ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. చిరంజీవిని 'గాడ్‌ఫాదర్'గా చూపించడంలో వందశాతం సఫలీకృతుడయ్యారు డైరెక్టర్ మోహన్‌రాజా. అందుకే ఫలితానికి అతీతంగా అతనిపై ప్రశంసల వర్షం కురిపించారు మెగాస్టార్. ఆ ఇష్టంతోనే మరో అవకాశం కూడా ఇచ్చేసినట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవి కుమార్తె సుస్మిత పేరిట ఏర్పాటు చేసిన కొత్త నిర్మాణ సంస్థలో చిరంజీవి సినిమా చేయనున్నట్టు గతంలో ప్రకటించారు. ఆ సంస్థ నిర్మించే తొలి చిత్రానికి కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహించనున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత దీనికి సంబంధించిన విషయాలేం బయటకు రాలేదు. అందుతున్న సమాచారం మేరకు ఈ సంస్థ తొలి చిత్రాన్ని తెరకెక్కించే బాధ్యతను మోహన్‌రాజాకు అప్పగించినట్లు తెలుస్తున్నది. స్క్రిప్ట్ నెరేషన్ పూర్తయిందని, చిరంజీవి కూడా పచ్చజెండా ఊపేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలు వెల్లడికానున్నాయ్.



## ఆలోచనా ధోరణి మారాలి

ఆధునిక సమాజంలో శరీరాకృతి, వర్ణం ఆధారంగా కనబరిచే వివక్షను అంతం చేయాలని కోరింది అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్. బాడీషేమింగ్ (శరీరాకృతిని అవహేళన చేయడం) అత్యంత హేయమైన చర్య అని ఆమె అభిప్రాయపడింది. అందం, వర్ణం వంటి విషయాలతో సంబంధం లేకుండా మంచి గుణం ఆధారంగానే వ్యక్తులకు విలువనివ్వాలని చెప్పింది. సీతారామం, హాయ్ నాన్న వంటి చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఈ మరాఠీ సుందరి ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో మంచి అవకాశాలను దక్కించుకుంటున్నది. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్, నటి డాలీసింగ్‌కు మద్దతుగా మృణాల్ ఠాకూర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలపై సోషల్‌మీడియాలో ప్రశంసలొస్తున్నాయి. శారీరక ఆకృతిలో క్రమంగా చోటు చేసుకునే హెచ్చుతగ్గుల వల్ల తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని డాలీసింగ్ సోషల్‌మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఆమెకు మద్దతుగా నిలిచింది మృణాల్ ఠాకూర్. 'శరీరాకృతిపై చేసే అవహేళన క్షమించరానిది. ఈ విషయంలో ప్రజల ఆలోచనా ధోరణి మారాలి. శరీరం గురించి కాదు మంచి మనసు గురించి మాత్రమే ఆలోచించాలి' అని మృణాల్ ఠాకూర్ పేర్కొంది.

## మా కలలన్నీ వాడికోసమే

నటి యామి గౌతమ్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఆమె భర్త ఆదిత్యధర్ సోషల్‌మీడియాలో షేర్ చేశారు. ఆ బాబుకి 'వేదవిద్' అని నామకరణం చేసినట్టు ఆయన ఆ పోస్ట్‌లో తెలియజేశారు. ఈ విషయంపై యామి గౌతమ్ కూడా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంది. 'ఇప్పటి వరకూ ఒక ప్రయాణం.. ఇక నుంచి మరో ప్రయాణం. నా బిడ్డను తొలిసారి చూసుకున్నప్పుడు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేదు. ఇక మా జీవితం వాడికోసమే. మా కలలన్నీ వాడికోసమే. మా కుటుంబానికే కాక, దేశానికే గర్వకారణం అయ్యేలా వాడ్ని పెంచుతాను. వాడెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నా' అంటూ పేర్కొన్నది యామి గౌతమ్. తల్లి అయిన యామి గౌతమ్‌కి అభిమానులేకాక, సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతున్నారు.





## మరోసారి కాంబో..!

ఇటీవలే విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడని తెలిసిందే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందన రాబట్టలేకపోయింది. ఇక విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న పాన్ ఇండియా స్పై యాక్షన్ ఫిల్మ్‌పై ఫోకస్ పెట్టాడు. 2020లో నిర్మాత కేదార్ సెలగం శెట్టి విజయ్ దేవరకొండ హీరోగా సుకుమార్ డైరెక్షన్‌లో ఓ సినిమా ప్రకటించారని తెలిసిందే. అయితే అప్పటి నుంచి ఈ సినిమా అప్‌డేట్ ఏమీ బయటకు రాలేదు. తాజాగా ఆనంద్ దేవరకొండ లీడ్ రోల్‌లో నటిస్తున్న గం గం గణేశా క్వశ్చన్ అండ్ ఆన్సర్స్ సెషన్‌లో విజయ్‌సుకుమార్ సినిమా మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ మూవీ గురించి తాజా సెషన్‌లో కేదార్ సెలగం శెట్టి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ట్రాక్‌పైనే ఉందని, సుకుమార్ పుష్ప 2, ఆర్‌సీ 17 సినిమాలు పూర్తి చేసిన తర్వాత విజయ్ దేవరకొండ ప్రాజెక్ట్ మొదలవుతుందని క్లారిటీ ఇచ్చేశారు. ఈ అప్‌డేట్‌తో ఓ వైపు విజయ్ దేవరకొండ.. మరోవైపు సుకుమార్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. వీడీ 12ప్రస్తుతం వైజాగ్‌లో భారీ షెడ్యూల్ షూట్ కొనసాగుతుంది. ఈ షెడ్యూల్ నెల రోజులపాటు కొనసాగనుందట. మరోవైపు టాక్సీవాలా ఫేం రాహుల్ సంకీర్త్యన్ దర్శకత్వంలో VD14 మూవీ ప్రకటించాడు. మరోవైపు రాజావారు రాణిగారు ఫేం రవికిరణ్ కోలా తో సినిమా చేస్తున్నాడు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com